# స్త్రీ హృదయం

వేపకొమ్మ
రాధాకృష్ణమూర్తి బి. ఎస్.సి.

మా ఆవిడ రాజ్యానికి సుజాత అంటే గిట్టనే గిట్టదు. సుజాత మా ఆఫీసులో ఓ గుమాస్తా. నాతోపాటే అన్నమాట. రాజ్యం అన్నీ తెలిసీ, అన్నీ తెలీకండా ప్రవర్తిస్తుంది. ఆమె సవ్యభారత దేశానికి సరిపోదు. ఆమెకు చాల మూఢనమ్మకాలున్నాయి. ఆమె భర్త పరాయి ఆడదానితో చనువుగా మాటాడినా, వాళ్ళ యింటికి పోయినా చాల అనుమానం. ఆమె యింకను నాగరకురాలు కాలేదని అనాలి. రాజ్యం ఒక సంసార స్త్రీగా నుండుటకు చాల తగింది. ఎంత సేపటికీ ఇంటి సంగతులేగానీ వేరేమీ అవసరంలేదు. మా ఆఫీసరును మార్చినందున నిన్న మా ఆఫీసులో టీ పార్టీ జరిగింది. అందులో నా ప్రక్కనే ఆవిడ కూర్చుంది. ఈ విషయం ఎవడో ఒక గుమాస్తా తన భార్యతో చెప్పగా ఆవిడ రాజ్యానికి తెలియజేసింది. ఇంటికి రాగానే లడాయి. మితిమీరి పోతున్నారంటే, లోకులు అనేక విధాలుగా అనుకొంటున్నారంటే, ఇంతకన్నా ద్రోహం యేముందంటే ..., ఓ ... వేయిరకాలుగా ఆడిపోయడం.

ఇంతకూ ఒకరి ప్రక్కన ఒకరు కూర్చున్నందునా, మాటాడినందునా యేంతప్పులేదని నావాదన. అది చెవిని బెట్టేగా! తక్కిన వారంతా అలాచేస్తున్నారా? అని ప్రశ్న. మనం ఒకరి త్రోవను ఎందుకు వెళ్ళాలని నేనూ. మనమార్గం శుద్ధమైనపుడు ఒకరిని అనుసరించడంలో అర్థంలేదని నావాదన. ఇంతకూ నావాదన నిల్చిందనా ... ఊహు ... నాకే విసుకేసింది. వాకిట్లోకిపోయి యీజీచైరులో కూర్చొని సిగరెట్ ముట్టించా. పొగ వదలుతుంటే రింగులు రింగులుగా మేఘాల్లా పైకి పోతున్నాది. అప్పుడు నామనస్సులోని కష్టాలన్నీ అలా ఎగిరిపోయినట్లే భావించా. ఇంతలో ఆలోచనలు ... అయిదేండ్ల క్రిందట విషయాలు.

అప్పటికి నాకింకా పెళ్ళికాలేదు. ఆ సంవత్సరమే బి. యెస్. సి. పాసైనాన్నమాట. ఉద్యోగం కోసమై మద్రాస్ వెళ్ళాను. ఒక రోజున మెరీనాకువెళ్ళి ఇసకలో కూర్చొని యేదో ఆలోచనలో మునిగియున్నా. వెనకనుండి చప్పట్లు వినవచ్చాయి. ఎవరా అని వెనక్కి చూచేసరికి ఎవరో ఒక వ్యక్తి, ఒక ఆడుది, ఆవిడ సరాసరి నావైపే వస్తూంది. ఎవరా అని ఆలోచించా. ఆమెది మావూరే. చిన్నతనాన్నుండీ తెలివిగా తరగతులన్నీ దాటుకొని వచ్చింది. ఇప్పుడేం చేస్తుందో తెలీదు. కానీ ఆమె నన్నెలా అంత దూరాన్నుంచి గుర్తించిందో ఆశ్చర్యం. ఇంతలో దగ్గరికివచ్చి,

"ఏమండీ, — గారూ, యేమిక్కడ నున్నారే" అన్నాది.

"ఏమిలేదులెండి" అన్నా. ఆమె పేరేమిటా అని జ్ఞాపకం చేసికొంటూ ఇంతలో, "యేమండీ— యేదో ఆలోచనలో ఉన్నారే. నన్ను జ్ఞప్తియుందా."

"మిమ్మల్ని గుర్తించలేకేమి."

"అయితే నా పేరు చెప్పండి" అన్నది.

తలపై బండ పడ్డట్లైంది. పేరు చెప్పకపోతే మరచినట్లే. తప్పుపేరు చెప్పిన నవ్వుల పాలౌతుంది. అయినా ధైర్యంచేసి "మీ పేరు సుజాత కదూ"... అన్నా.

"ఔను ... అట్లయితే జ్ఞాపకమున్నట్లే."

'అబ్బా ధన్యుడను' అనుకొన్నా.

తర్వాత యేదో లోకాభి రామాయణం జరిపాము. చిన్నప్పటి విషయాలు చర్చించాం. కాలం సరదాగానే గడిచిపోయింది. చీకటిపడింది. ఇరువురు విడిచిపోయి బసలకు దారి సాగించాం.

అది మొదలు అచట కలుసుకోటం అలవాటైంది. ఆమె అప్పుడు ఇంటర్ చదువుతూండేది. క్రమంగా ఆమెకు అర్థంకాని పాఠాలను నేనే 'టీచ్' చెయ్యటా

నికి మొదలెట్టాను. ఆమెకు ప్రతిదినమూ నోట్సు కూడ వ్రాసిస్తుండేవాడిని.

ఆదేదో ఆమెపై నాకో అభిప్రాయం యేర్పడింది. అది యేమిటో అని నేనెప్పుడూ ఆలోచించలేదు. కానీ ఆవిడతో బీచిలో కూర్చున్నప్పుడు నాలో యేదో వుద్రేకంగా వుండేది. సుజాత నాతో చాల చనువుగా వుండేది. ప్రక్కనే వచ్చి కూర్చొని చాల ముచ్చటగా మాట్లాడేది. సుజాత మాట్లాడేటప్పుడు ఆమె కండ్లల్లో యేదో జ్యోతి నాకు కన్పించేది. ఆమె ముఖంలో ఒక తేజస్సు కన్పడేది. అది నా ఒక్కడి అనుభవమో అందరికలా వుంటుందో నాకు తెలీదు. నాలోని మార్పులేమైనా ఆమె గ్రహించిందో లేదో!

ఒకనాడు ఇద్దరం బీచిలో కూర్చుండి యున్నాం. దగ్గరలోనే సముద్రపుటలలు విపరీతంగా మ్రోగుతున్నాయ్. విసుగులేకుండా ఒక్కొక్క అల ఒడ్డుకుతన్ని వెనక్కు మరలి నశిస్తూంది. వినీలాకాశం, నీలసముద్రం రెండూ దూరానా యేకమైనట్లుంది. ఆ ప్రాంతంలో అట్టే జనంకూడా లేరు. నా హృదయంలోవున్న విషయం వెలికి ఉబుకుతుంది. చెప్తే యేమనుకొంటుందో? సంతోషించునో, పరితపించునో, యెలా తెలుస్తుంది. చెప్పకున్న ... నిజం ఎన్నటికీ దాగదు కదా, తర్వాతైనా జరిగేది జరక్కమానదు. అంత్య నిష్ఠూరంకన్నా ఆది నిష్ఠూరమే మేలు. యేమైనాసరే హృదయంలో వున్నది చెప్పవలసిందే అని నిశ్చయించా.

“సుజాతా!” అని పిల్చాను. తిరిగి చూచింది. ఆమె దృక్కులు ప్రశ్నార్థక చిహ్నాలుగావున్నై.

మరల నిశ్శబ్దం.

“యేమిటండీ” అనింది.

“చూచావా వినీలాకాశం. ఎంత గంభీరంగా వుందో. ఆ సముద్రఘోష చూచావ్. ఆ వచ్చే అల ఎంత భీకరంగావుందోచూడు. ఇంతలో ఒడ్డు తగిలి పటాపంచలైపోయింది” అన్నా యేదో ధోరణిలో. నేను చెప్పదలచుకొంది ఇది కాదు.

“ఏమండీ యీవేళ ఓమాదిరిగా వున్నారే” అన్నది.

“యేమీలేదు... నేను రేపుప్రొద్దున Express లో మావూరికి వెళ్ళిపోతున్నా.”

“ఆ...అలానా ... మీరింతకుముందు చెప్పనేలేదే? ఇంత త్వరగాపోవటం యెందుకో? ఇంట్లో అందరూ కులాసాయేనా” అని ప్రశ్నల వర్షం కురిపించింది.

“అబ్బే అంతా బాగున్నారు. పదిరోజుల్లో నా వివాహం” అన్నా.

“ఆమె మొదట నిర్ఘాంతపడింది.” కానీ సర్దుకొని,

“ఓహో అదా విషయం. ఇన్నిరోజులు దాచారే? ఎవరినిచ్చి మీకు వివాహం?”

“సంబంధువులే, మేనమామ కూతురే.”

“రాజ్యమా?”

“ఆ... అవును. రాజ్యాన్ని నీకు తెలుసా.”

“తెలీకేం, ఇది నాకు మనస్ఫూర్తిగా ఇష్టమే.”

“అంటే. రాజ్యం కాకపోతే ఇష్టంలేదన్న మాట.”

కొంచెము సేపూర్కొని “ఇప్పుడు నాకేం చెప్పాలో తోచడంలేదు. ఇన్నాళ్ళు మీపై ఆశ పెట్టుకున్నాను, కాని రాజ్యం మీకు దగ్గరి బంధువు. నాకు కొంచెము తెలిసినావిడ కాబట్టి నేవిరమించుకోవలసిందే” అంది. తామరాకుపై నీటిబిందువు ఆమె కనుగొలుకుల్లో రెండు కన్నీటిబిందువులు జారి చెక్కిళ్ళనుదాటి వక్షస్థలమున లీనమైపోయినై.

“నేను చాల రోజుల్నుంచి మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నాహృదయంలో మీకుతప్ప ఇంకెవ్వరికీ తావులేదు. కానీ ... మీకెలాంటికష్టం తెచ్చిపెట్టడం నాకిష్టంలేదు. నన్ను మాత్రం మరువకండి. రాజ్యాన్ని అడిగినానని చెప్పండి. అంటూ లేచింది.”

నాకేమీ తోచలేదు. లేచాను. నిశ్శబ్దంగా ఇసకలో ఇద్దరమూ బీచిరోడ్డుదాకా నడచాము. "వస్తానండీ" అన్నది. "సరే"నన్నా. విడి పొయ్యాం. తర్వాత సుజాత విషయం చాలమట్టుకు మరచా.

తర్వాత నేను మద్రాసులో గుమాస్తాగా చేరి నపుడు మళ్ళీ సుజాత పరిచయం కలగడం, ఆమె అప్పటికి బి. ఏ ప్యాసు చేసింది. ఉద్యోగాలు సులభంగా దొరకటం మూలాన మా ఆఫీసులోనే ఓ గుమాస్తాగా చేరింది. ఎట్లైనా పూర్వ పరిచితు డనుగాన నాతో అందరికన్నా చనువుగా వుండేది. అది కొంతమందికిపడదు. ఆ సంగతి తెలిసినపుడు రాజ్యం నన్ను చీవాట్లు పెడుతుంది. మాట్లాడినా రాజ్యానికి కోపం. మాట్లాడకుండిన సుజాతకు కష్టం కల్గించినట్లౌతుంది. సుజాత హృదయం నాకు తెలుసు. ఆమె రాజ్యంకోసమై తన సుఖాన్ని వదలుకొంది. రాజ్యానికి ఈ విషయం తెలీదు. ఎలా తెలియజేయడం? ఆపుడు పూర్వ విషయా లన్నీ త్రవ్వుకొన్నట్లవుతుంది. ఇంట్లో గోల ఎక్కువౌ తుంది. నామాట నమ్మేవారుండరు. చెప్పికూడ యేంఉపయోగం కన్పించలేదు. అందుచే చెప్పలేదు. కాని దినదినం సుజాత నాతో చనువుగా నుండటం ఎక్కువౌతుంది. ఇందులో చెడ్డ అభిప్రాయాలేవీ వుండుటకు అవకాశంలేదు. కాని రాజ్యం అను మానాలు మాత్రం ఎక్కువౌతున్నాయి. నిన్న మా ఆఫీసర్ను మార్చిన రోజున జరిగిన గల్లంతు ఇంతా అంతా కాదు.

నేను మాత్రం సుజాతను గురించి నా అభిప్రా యము నడవడిని మార్చుకొనడమేలేదు. ఎందుకంటే అందులో నాతప్పేమీ నాకు కాన్పించలేదు. అయితే సుజాత వద్ద రాజ్యం విషయాలేవీ ప్రసంగిం చను. ఆమె అడిగినా ముక్తసరిగ జవాబు చెప్పి ప్రసంగము మార్చివేయడం. ఆమె అప్పుడప్పుడు రాజ్యాన్ని చూట్టానికి ఇంటికి వస్తానంటుంది. నేనే ఏదో కారణంచెప్పి మార్పిస్తుండేవాడిని. ఎప్పుడో ఒకసారి నేను సుజాతను "పెండ్లిచేసుకోరాదా" అని ప్రశ్నించాను. అందుకామె ధీరత్వంగా, "ఆమాట ఈ జన్మలో తలపెట్టను" అనేసరికి నాకాశ్చర్యమువేసి ఇంక ఆ ప్రస్తావనే తేలేదు.

ఇట్లుండగా రాజ్యం ప్రసవించే రోజులు వచ్చినవి ఆమెను పుట్టింటికి పంపేశాను. హోటల్లో భోజనం రెండురోజులకే విసుకేసింది. ఇంకసాంబారుకు స్వస్తి చెప్పి హాయిగా వండుకొని తిందామనిపించింది, ప్రతిదినం అలాగే వంటచేసుకొని భోంచేసి ఆఫీసుకు వెళ్ళేవాడిని. ఒకే ఆఫీసైనా పని తొందరచే రాజ్యం అమ్మగారింటికి పోయిన పదిరోజులవరకూ సుజాతను కలుసుకొని శాంతంగా మాటాడ్డానికి వీల్లేకపోయింది. ఒకరోజున నాకు జ్వరం వచ్చింది. ఇంట్లో పత్యం పెట్టేవాళ్ళెవరూలేరు. ఆ మద్రాసు మహాపట్టణంలో పలకేవారెవరూ, అప్పటికీ పక్కింట బ్బాయిని బ్రతిమాలుకొని సెలవుకాగితము ఆఫీసుకు, పంపాను. కాఫీ మాత్రం ఎట్లో తెప్పించుకొని, తాగి ఇంట్లోపడుకొని యున్నా. సెలవు కాగితము చూచికాబోలు సుజాత మధ్యాహ్నమే మాయింటికి వచ్చింది. అదేమొదటి సారి. అప్పుడు రాజ్యం ఇంట్లోవుంటే యేమవునో ... నాకే చాల ఆశ్చర్యం వేసింది.

"ఏం సుజాతా, ఇప్పుడు వచ్చేవే?" అన్నా.

"ఏం లేదు. మీకు జ్వరం వచ్చిందంటే చూట్టా నికి వచ్చా."

"ఆ.. కొద్దిపాటి జ్వరమే. యేంప్రమాదం లేదు. లెండి."

"అయినా మందు తెప్పించారా ... రాజ్యంగా రేరీ" అన్నాది వంటింటి వైపుచూస్తూ.

"నాకప్పటికి సంగతి జ్ఞప్తికి వచ్చింది." రాజ్యం కాన్పుకై పుట్టింటికి వెళ్ళింది" అన్నా.

(మిగతా 209 పేజీలోచూడుడు)

(176-వ పేజి తరువాయి)

"ఓహో అలాగా చెప్పనేలేదే. అయ్యో నేనో సారి వచ్చి చూచిపోయేదాన్నే. ఆమెను చూచి ఎన్నో యేళ్ళయింది. పాపం ఏమనుకుందో" అన్నాది.

నాకప్పుడు యేం మాట్లాడాలనో, నవ్వాలనో, యేడవ్వాలనో తెలీదు. పాపం రాజ్యం తన్ను చాల ప్రేమిస్తుందని సుజాత అభిప్రాయం. రాజ్యానికి సుజాత అంటే నిప్పులో ఉప్పు అని తెలీదు. యేం చెయ్యను మరి.

ఇలా జవాబిచ్చాను. "లేదు సుజాతా! పనితొందరలో యీమధ్య నిన్ను తలుచుకోటమే లేదుగా. ఎలా చెప్పడం మరి."

"అది పోనియ్యండి. మీకిప్పుడు మందు రొట్టె ఇచ్చేది ఎవరు."

"అచ్చే. దీనికి మందెందుకూ. లంకణం పరమౌషధం అన్నారు. రేపటికి తగ్గిపోతుంది." కాని ఆవిడ ఒప్పుకోకండా సీసా పట్టుకెళ్ళి మందున్నూ, రొట్టె తెచ్చింది. తాను గూడ ఆరోజు, మరురోజు సెలవుపెట్టి నాకు పరిచర్య చెయ్యటం మొదలెట్టింది. మౌనముద్ర వహించి అన్నిటిని ఒప్పుకొన్నా. జ్వరం నయమైన తర్వాత ఎప్పటి వలెనే హోటల్లో భోంచేయడానికి మొదలెట్టా సుజాత భయమువల్ల.

ఇంతలో రాజ్యానికి మగపిల్లవాడు పుట్టాడని ఆఫీసు "తంతి" వచ్చింది. సుజాత ఆనందం చెప్పనలవికాదు. వెయ్యిసార్లు నాకు కంగ్రాచులేషన్సు చెప్పింది. నేనుమాత్రం అన్నిటికి మౌనం వహించాను. వారంరోజులు సెలవుపెట్టి మూడవరోజే అత్తారింటికి బయల్దేరాను.

అక్కడ తొమ్మిది రోజులుగడిచినై. పదవరోజు "బారసాల," పిల్లవానికి నామకరణం చెయ్యడం. దగ్గరి మిత్రులకు ఆహ్వాన పత్రికలు పంపాం.

సాయంత్రం నాలైంది. అందరికీ భోజనాలైనాయి. హాల్లో కూర్చొని వున్నాం. పిల్లవాణ్ణి ఒళ్ళో వుంచుకొని రాజ్యం కూడ అక్కడనే వుంది. ఇంతలో వాకిట్లో యేదో చప్పుడైంది, గబగబ సంచి ఒకటి చేతపట్టుకొని, సుజాత లోనికి ప్రవేశించేసరికి నాకు ముచ్చెమటలు గ్రమ్మినై "సుజాతా! రండి, కూర్చోండి" అనగానే ఆకుర్చీలో కూర్చుంది. "ఆహ్వానం లేకుండానే వచ్చేసా. నాకాహక్కుంది కాబట్టి," అన్నాది నవ్వుతూ. ఆమాటన్నది నాపై మమకారము, స్నేహభావముచేత నేనని నాకు బాగాతెలుసు. అందుచేనేను, "మీకు మేమాహ్వానాలేంటి పంపేది" అన్నా ముక్తసరిగా అంతలో "పిల్లాడేడి?" అని రాజ్యం దగ్గరకెళ్ళి "ఇదుగో రాజ్యం, పాపకి చొక్కా చెడ్డీ" అని చిన్న సిల్కు చొక్కా చెడ్డీని సంచిలోంచి తీసి ఇవ్వబోయింది.

ఇదంతా చూస్తున్న రాజ్యం మండిపడి పోతుంది. ఉరిమి చూస్తూ, "నిన్నెవ్వరమ్మ వాన్నారిక్కడికి. మద్రాసులో అల్లాడిచ్చేది కాకండా ఇక్కడికీ వచ్చావా శనిగ్రహంలా. నీచొక్కాలకైమేం కాచుకొండలే. తనకేవో హక్కట ..." అంటూంటే సుజాత రాయివలె ఆక్లే నిలబడి పోయింది. నేను మంత్రగానిచే నోరు కట్టివేయబడ్డటుల స్తంభించి పోయ్యాను. అంత సుజాత, "క్షమించు రాజ్యం" అన్నది. చొక్కా చెడ్డీ తెలీకండానే క్రింద పడ్డది. తాను సరాసరి వీధిలోకి నడిచింది. నాకు దిక్కుదోచలేదు, ఒక్కనిముసానికి తెలివి వచ్చి వేగంగా వాకిట్లోకి పోయినా. యేదీ సుజాతని "సుజాతా,. సుజాతా -" ... ఇంకెక్కడి సుజాత!

—o—